ఇంటి ముంగిటకు రేషన్


రామభద్రపురంలో ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ ఆపరేటర్

- నియోజకవర్గంలో 85,387 రేషన్ కార్డులు, 53 వాహనాలు
- పేదల వద్దకే నిత్యావసరాలు
- తొలగిన ఇబ్బందులు
- ఇంటింటికీ రేషన్ పథకానికి మూడేళ్లు

నియోజకవర్గంలో మండలాల వారీగా కార్డులు, వాహనాల వివరాలు

మండలం	కార్డులు	వాహనాలు
రామభద్రపురం	15,440	09
బాడంగి	14,907	09
బొబ్బిలి	36,151	24
తెర్లాం	18,889	11

రామభద్రపురం: రేషన్ కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పనిలేదు. కిలోమీటర్ల దూరం నడవాల్సిన అవసరం అంతకంటే లేదు. ఇంటి వద్దకే రేషన్ వస్తోంది. గతంలో బియ్యం తీసుకోవాలంటే రోజుల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. సరుకుల కోసం వెళ్తే డీలర్ అందుబాటులో ఉండేవారు కాదు. రేషన్ కోసం రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. తూకంలో మోసం సరేసరి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి గడప వద్దకే రేషన్ సరుకులు అందించడానికి ఎండీయూ ఆపరేటర్లను నియమించారు. వారికి వాహనాలు అందించారు. నియోజకవర్గంలో 85,387 రేషన్ కార్డు హోల్డర్లు ఉండగా వీరికి 53 వాహనాలలో 53 మంది ఎండీయూ ఆపరేటర్లు ఇంటి వద్దకే వెళ్లి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. దీంతో ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి. తూకాల్లో మోసానికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా రేషన్ పంపిణీ చేస్తున్నారు. జీపీఎస్, రైస్ కార్డు మ్యాపింగ్ ప్రక్రియ చేపటి ప్రజలకు సరుకులు అందిస్తున్నారు. జీపీఎస్ మ్యాపింగ్‌తో లబ్ధిదారులు ఏ రేషన్ షాపు పరిధిలో ఉన్నా.. నివసించే ప్రాంతంలోని చౌక దుకాణం నుంచే పోర్టబులిటీ ద్వారా రేషన్ తీసుకోవచ్చు. వేరే ప్రాంతానికి వెళ్తే.. ఆ ప్రాంత వలంటీర్‌కు సమాచారం ఇచ్చి జీపీఎస్ మ్యాపింగ్ చేయించుకుంటే చాలు... గడప దాటకుండానే నెల ఆరంభంలోనే ఒకటో తేదీ నుంచి 17వ తేదీలోగా సరుకులు అందించనున్నారు. ఏ రోజు ఏ వీధిలో ఎవరి ఇళ్ల వద్దకు ఎన్ని గంటలకు రేషన్ డెలివరీ వాహనం వస్తుందో ముందస్తు సమాచారం ఇస్తున్నారు. కుటుంబంలో ఒకరుంటే చాలు సరుకులు అందజేస్తున్నారు. లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి వద్దకే సరుకులు



మాది కోటశిర్లాం పంచాయతీ ముదుర గ్రామం పాడివానివలస. గతంలో సుమారు రెండు కిలో మీటర్లు దూరంలో కోటశిర్లాంలో ఉన్న రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు తెచ్చుకోవలసి వచ్చేది. ప్రస్తుతం మా ఊరిలో ఇంటి వద్దకే వ్యానులో వచ్చి సరుకులు ఇస్తున్నారు. ప్రభుత్వం ఇలాంటి సౌకర్యం కల్పించడంతో మాలాంటి వారికి, వృద్ధులకు, దివ్యాంగులకు చాలా సంతోషంగా ఉంది.

– బోని అరుణజ్యోతి, పాడివానివలస

సకాలంలో సరుకులు



అధికారుల ఆదేశాల మేరకు సకాలంలో ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నాం. మాకు ఆడాప్ట్ చేసిన గ్రామాలకు ఎప్పుడు వచ్చేది ముందుగానే తెలియజేస్తాం. దీంతో వాహనం వచ్చిందని లబ్ధిదారులు వచ్చి సరుకులు తీసుకెళతారు. మా ఆపరేటర్లకు జీవనోపాధి కల్పించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– పాడి రామకృష్ణ, ఎండీయూ ఆపరేటర్, ఎస్.సీతారాంపురం

పారదర్శకతకు పెద్దపీట



పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. తూకాల్లో మోసం లేకుండా ఎల్కక్ట్రానిక్ కాటా ద్వారా లబ్ధిదారుని ఎదురుగా సరుకులు తూకం వేసి పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా వాహనాలను ఏర్పాటు చేసి గడప గడపకు నిత్యావసర సరుకులు లబ్ధిదారులకు అందజేస్తున్నాం. సకాలంలో నాణ్యమైన బియ్యం అందజేస్తున్నాం. నిత్యం పర్యవేక్షణ చేస్తున్నాం.

– రెడ్డి సాయికృష్ణ, సీఎస్‌డీటీ, రామభద్రపురం

సీఎం జగన్‌తోనే రాష్ట్ర సంక్షేమం


ఖండ్యాంలో పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌కు స్వాగతం పలుకుతున్న పార్టీ నేతలు, గ్రామస్తులు

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ రాజేష్

రేగిడి: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తోనే అందరి కుటుంబాల్లో సంక్షేమ వెలుగులు విరజిమ్ముతున్నాయని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని కొమెర, వెంకటాపురం, ఖండ్యాం, వన్నలి, అంబఖండి, వండానపేట, ఉంగరాడ, కేఎంవలస తదితర గ్రామాల్లో ఆయన బుధవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలతో ఆయన మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజల్లోకి నేరుగా వెళ్లే సత్తా వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందని వెల్లడించారు. దేశానికే ఆదర్శంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడంతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గులివి జగ్గున్నాయుడు, నెల్లి పెంటన్నాయుడు, సంకిలి సొసైటీ అధ్యక్షుడు లావేటి వేణుగోపాలనాయుడు, పార్టీ యూత్ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గొలివి అనూరాధ, మాజీ ఎంపీటీసీ బట్న సూర్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యసనాభివృద్ధికి కృషి చేయాలి


ఎంఈఓ, ఎల్‌ఐపీ బృందం పరిశీలించిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఎంఈఓ జె.త్రినాధరావు, ఎల్‌ఐపీ బృందం సభ్యులు అన్నారు. మండలంలోని నెమలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈఓతో కలిసి ఎల్‌ఐపీ బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల టీచింగ్ లెర్నింగ్ మెటీయల్‌ను, విద్యార్థుల అభ్యసనా స్థాయిని తనిఖీ చేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులంతా విద్యార్థులను చదవడం, రాయడంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 పాపారావు, నెమలాం హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎల్‌ఐపీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

కులగణనలో మండలం టాప్


రామభద్రపురంలో కులగణన సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

రామభద్రపురం: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వే విజయవంతంగా సాగుతోంది. నియోజకవర్గంలోని రామభద్రపురం మండలం ప్రథమ స్థానంలో ఉంది. రామభద్రపురం మండలంలో 15,774 ఇళ్లు ఉండగా వీటిలో ఇప్పటి వరకు 14,902 ఇళ్లల్లోని కుటుంబాల వివరాలను నమోదు చేసి 94.47 శాతంతో మొదటి స్థానంలో నిలవగా బొబ్బిలి మండలంలో 22,249 ఇళ్లకుగాను 20,915 ఇళ్లల్లోని కుటుంబాల వివరాలు నమోదు చేసి 94 శాతంతో ద్వితీయం స్థానంలో ఉంది. తెర్లాం మండలంలో 19,840 ఇళ్లకుగాను 18,610 ఇళ్లల్లోని కుటుంబాలు, బాడంగి మండలంలో 15,623 ఇళ్లకుగాను 14,542 ఇళ్లల్లోని కుటుంబాల వివరాలు నమోదు చేసుకుని 93.08 శాతంతో ఆఖరి స్థానంలో ఉన్నాయి. ప్రతీ మండలంలో ఎంపీడీఓ, తహసీల్దార్ రెండు బృందాలుగా వలంటీర్లు చేస్తున్న చేపడుతున్న సర్వేను సూపర్ విజిట్ చేస్తున్నారు. అభ్యంతరాలుంటే మళ్లీ వలంటీర్ లాగిన్‌కు పంపించి మళ్లీ చేయిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఈశ్వరమ్మ మాట్లాడుతూ కులగణను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు ప్రయోజనాన్ని చేకూర్చడానికి ఈ సర్వే దోహదపడుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.

37వేల సర్వే రాళ్ల ఏర్పాటు


పూడివలసలో సర్వేరాళ్లు పాతిన స్థలాలను పరిశీలిస్తున్న డీఐఓ రవికుమార్

బాడంగి:

మండలంలోని 27 రెవెన్యూ గ్రామాలలో ఇప్పటి వరకు సుమారు 37,300 వరకు సరే రాళ్లు ఏర్పాటు చేసినట్టు జిల్లా సర్వే విభాగ ఇన్‌స్పెక్టర్ టి.రవికుమార్ తెలిపారు. మండలంలోని పూడివలసలో సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని బుధవారం ఆయన సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మట్లాడుతూ మండలంలో మొత్తం 29 రెవెన్యూ గ్రామాలుండగా ఇప్పటికే 27 గ్రామాలలో భూముల రీసర్వే పనులు పూర్తి చేశామన్నారు. జిల్లాలో బాడంగి మండలంలోనే రీసర్వే ప్రథమంగా పూర్తి స్థాయిలో జరిగిందన్నారు. వాడాడ, పినపెంకి గ్రామాల్లో రీసర్వే చేయాల్సి ఉందన్నారు. ఆయన వెంట మండల సర్వేయరు సాయికుమార్, సర్వేయర్లు ఉన్నారు.

పదో తరగతిలో మరోసారి సత్తా చాటాలి


పాగిరి పాఠశాల ఆవరణలో డిప్యూటీ ఈఓను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రాజాం సిటీ: పదో తరగతిలో విద్యార్థులు మరోసారి సత్తాచాటాలని బొబ్బిలి డిప్యూటీ ఈఓ పి.బ్రహ్మాజీ అన్నారు. మండల పరిధి పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది జిల్లా టాపర్‌గా నిలిచిన పాఠశాలను ఈ ఏడాది పరీక్షల్లో స్టేట్ టాపర్‌గా నిలపాలని ఉపాధ్యాయులకు సూచించారు. అందుకు తగ్గట్టుగా అభ్యసన చేయాలని విద్యార్థులకు తెలిపారు. అనంతరం అల్లూరి సీతారామరాజు జిల్లా డీఈఓగా పదోన్నతి పొందిన ఈయనకు పాఠశాలలో హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు బలరాం, దాలినాయుడు, మూర్తి, నాగరాజు, రామారావు, రమ, జీవీ రమణ తదితరులు సత్కరించారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

వంగర: మండల పరిధి కొప్పరవలస గ్రామంలో సత్యసాయి సేవాదళ్ కన్వీనర్ సాదెం వెంకటరమణ పేదలకు నిత్యావసర సరుకులు బుధవారం పంపిణీ చేశారు. అలాగే సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిత్య అన్నదానం చేపడుతున్నట్లు వెల్లడించారు. కమిటీ సభ్యులు తూముల యోగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సంతకవిటి: మండల పరిధిలోని తాలాడ సచివాలయం సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఏఎస్‌ఐ వాసుదేవరావు బుధవారం తెలిపారు. కేసు నమోదు చేశామని చెప్పారు.

తాగునీటి పంపుహౌస్ పరిశీలన

రాజాం: పట్టణానికి తాగునీటిని అందిస్తున్న పంపు హౌస్‌ను మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు బుధవారం పరిశీలించారు. ఇక్కడ వస్త్రపురి కాలనీ వద్ద రక్షిత పథకం ట్యాంకులు పరిశీలించడంతో పాటు రేగిడిలో నాగావళి నది ఒడ్డున ఉన్న పంపు హౌస్ మోటార్లు పరిశీలించి ఆరా తీశారు. పట్టణంలో అన్ని వార్డులకు సక్రమంగా నీరు అందేలా పంపు హౌస్ మోటార్ల ఎఫిసెన్సీ పెంచాలని ఏఈ పి.వెంకట్‌కు సూచించారు.

పొరపాట్లను సరిదిద్దుకోవాలి

బాడంగి: గత నెలలో విడుదలైన తుది ఓటర్ల జాబితాలో తప్పులు, పొరపాట్లు దొర్లితే బీఎల్‌ఓలు సరిదిద్దాలని హెచ్‌డీటీ చిన్నంనాయుడు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా బీఎల్‌ఓలతో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు సరిదిద్దుకోవాలని సూచించారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్‌తో లబ్ధిదారులకు ఆర్థిక రక్షణ


రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

బొబ్బిలి: జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేపడుతున్నందున లబ్ధిదారులందరికీ ఆర్థిక రక్షణ కలుగుతుందని ఆర్డీఓ ఎ.సాయిశ్రీ అన్నారు. మండలంలోని పిరిడి సచివాలయంలో జరుగుతున్న ఇళ్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఆమె బుధవారం పర్యవేక్షించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆన్‌లైన్‌లో పరిశీలన చేశారు. పూర్తయిన ఇళ్లన్నీ రిజిస్ట్రేషన్ త్వరగా జరిగేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఎంపీడీఓ పి.రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


సంతకవిటి : గరికిపాడులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

సంతకవిటి: మండల పరిధిలోని గరికిపాడు గ్రామంలోని 2 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ తిరుమలరావు బుధవారం పరిశీలించారు. బీఎల్‌ఓలతో మాట్లాడి అక్కడ ఉన్న మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, ర్యాంపో, తాగునీరు సదుపాయాలు ఉండేలా చూడాలని అన్నారు. ఆయన వెంట బీఎల్‌ఓలు కనకమ్మ, దిలీప్‌కుమార్ ఉన్నారు.

రూ.27 లక్షలతో రక్షిత నీటి పథకం ట్యాంకు నిర్మాణం

రాజాం : మండలంలో గెడ్డవలస గ్రామంలో రూ.27 లక్షలతో జలజీవన్ మిషన్ వాటర్ ట్యాంకు నిర్మాణం చేపడుతున్నారు. గ్రామంలో ప్రతీ ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వావిలపల్లి జగన్మోహనరావు అన్నారు. 20 వేల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ట్యాంకును నిర్మిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రజలకు అందుబాటులో సేవలు


సచివాలయం తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ బాలసుబ్రహ్మణ్యం

వంగర: ప్రజలకు అందుబాటులో ఉంటూ సచివాలయాల సేవలందించాలని ఎంపీడీఓ ఎం.వి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. మండల పరిధి సంగాం సచివాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ దరఖాస్తులు, వాటి పరిష్కారం, సిబ్బంది హాజరు వంటి అంశాలను పరిశీలించారు. వేళకు ఉద్యోగులు సచివాలయాలకు రావాలన్నారు. ప్రజా సేవలపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ దూబ కిశోర్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ప్రజారోగ్యం


పట్టణంలోని 7, 8 వార్డుల పరిధిలోని ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ సాయిశ్రీ


కంచరవీధి సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు తదితరులు

బొబ్బిలి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యం మెరుగుపడిందని ఆర్‌డీఓ సాయిశ్రీ, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అన్నారు. పట్టణంలోని 7, 8 వార్డుల్లో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆర్‌డీఓ పరిశీలించారు. కంచరవీధి సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష కిట్లను మున్సిపల్ చైర్మన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలందరికీ ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులోకి సంపూర్ణంగా వచ్చాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'నమస్తే'లో పారిశుద్ధ్య కార్మికుల వివరాలు


పారిశుద్ధ్య కార్మికుల హాజరు తీసుకుంటున్న మున్సిపల్ కమిషనర్

రాజాం: వార్డు సచివాలయాల వారీగా ఆయా వార్డుల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల వివరాలు నమస్తే(నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్) పథకంలో నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు కార్మికులకు సూచించారు. పారిశుద్ధ్య కార్మికులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. కార్మికులు హాజరుపై ఆరా తీశారు. వార్డుల వారీగా వివరాలు సేకరించడంతో పాటు రేషన్, ఆధార్ కార్డు వంటి గుర్తింపు కార్డులతో ఆయా సచివాలయాల్లో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం వార్డుల వారీగా చేయాల్సిన స్పెషల్ డ్రైవ్ శానిటేషన్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

యాత్ర పోస్టర్ విడుదల


పోస్టర్ విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకులు

బొబ్బిలి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాత్రలతో గురువారం విడుదలవుతున్న యాత్ర చిత్రం ప్రజాదరణ చూరగొంటుందని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అన్నారు. యాత్ర చలన చిత్రం విడుదల సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం పోస్టర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, చంద్రపూడి రమేష్, కౌన్సిలర్ పాలవలస ఉమాశంకర్, దిబ్బగోపి, న్యాయవాది రుంకాన ప్రసాదరావు, కోట గోవింద పాల్గొన్నారు.

క్లుప్తంగా

రమాబాయి త్యాగమూర్తి

రాజాం సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాభాయి గొప్ప త్యాగమూర్తి అని రాజాం టౌన్ సీఐ డి.మోహనరావు అన్నారు. స్థానిక బాలికల వసతిగృహ ఆవరణలో రమాబాయి జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి బుధవారం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భర్త ఉద్యమానికి పిల్లలను సైతం త్యజించిన త్యాగమూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు ఆర్.జయరాం, వసతిగృహ వార్డెన్ నాగలక్ష్మి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఎంఈఓ తనిఖీలు

బొబ్బిలి: పట్టణం, మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ ఆయా తరగతులు చదువుతున్న విద్యార్థుల సిలబస్‌ను పూర్తి చేయాలని ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని గున్నతోటవలస, ఎంపీయూపీ పాఠశాలలను ఆయన బుధవారం వార్షిక తనిఖీ చేశారు. ప్రార్థన, మధ్యాహ్న భోజనం, వర్కుబుక్‌ల పరిశీలన, విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్ పరిశీలన వంటివి చేపట్టారు. ఉపాధ్యాయులతో చర్చించారు.

కమిషనర్ సుడిగాలి పర్యటన


సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కు వివరాలను తెలుసుకుంటున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: నూతన మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి బుధవారం పట్టణంలో సుడిగాలి పర్యటన చేసి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్క్‌లో ఎరువుల తయారీ, తడిపొడి చెత్త వేరు చేసి బ్యాగ్‌లుగా కట్టడం, పరిశీలించారు. జగనన్న కాలనీలను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడి వారి అవసరాలను తెలుసుకున్నారు. మల్లమ్మదేవి పార్క్ ఎదురుగా ఉన్న చేపల విక్రేతలను వేరే చోట విక్రయించుకోవాలని సూచించారు. ఆమెతో పాటు పర్యావరణ ఇంజినీరు సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు


సినీ గేయాలకు నృత్యాలు చేస్తున్న బాలికలు

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆద్యంతం అలరించాయి. అంతకు ముందు కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వలసపోకుండా ఉపాధి పనులు

రేగిడి: మండలంలో వలసలు లేకుండా అన్ని గ్రామాల్లో వేతనదారులకు ఉపాధి పనులు కల్పించాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ ఎస్.హరనాధరావు అన్నారు. మండలంలో అంబఖండి, వావిలవలస, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస తదితర గ్రామాల్లో పనులు బుధవారం ఆయన పరిశీలించారు. వేతనదారుల వివరాలు సేకరించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి కొలతలు ప్రకారం పనులు చేయించి, ప్రభుత్వం అందిస్తున్న వేతనం అందేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు వెల్లడించారు. కార్యక్రమంలో ఈసీ రామినాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్టు

వంగర: మండల కేంద్రంలో ఈ ఏడాది జనవరి 25న జరిగిన నగదు చోరీ కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ వైవీ జనార్దన్ బుధవారం తెలిపారు. వంగర గ్రామానికి చెందిన కోరాడ సూరమ్మ ఇంట్లో లక్ష రూపాయలు నగదు పోయినట్టు అప్పట్లో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో మండలంలోని సంగాం గ్రామానికి చెందిన బొడ్రోతు నర్సింహులు దొంగతనానికి పాల్పడినట్టు గుర్తించామని, అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

గురుకులంలో అభ్యసనాభివృద్ధి బృందం పర్యటన

బాడంగి: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జిల్లాకు చెందిన అభ్యసనాభివృద్ధి బృందం సభ్యులు బుధవారం సదర్శించారు. పాఠశాలలో 6, 7, 8 తరగతుల పిల్లల క్లాస్‌రూంల్లోకి వెళ్లి వారి అభ్యసనాభివృద్ధి స్థాయిని పరిశీలించారు. పిల్లలకు ఎల్‌ఐపీ అమలు చేస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు. సబ్జెక్టు టీచర్ల యొక్క టీచింగ్ ఎబిలిటీని పరిశీలించారు. ఈ నెల 20 నుంచి 23 వరకు రాష్ట్ర ఎల్‌ఐపీ బృందం పర్యటించనున్నందున అందుకు అవసరమైన సూచనలు చేశారు. బృందంలో నాగభూషణరావు, శ్రీనివాసరావు, సత్యంనాయుడు, సోమయాజుల శంకరరావు, హాజరు కాగా ప్రిన్సిపాల్ టి.రామదాసు సమక్షంలో పరిశీలన చేపట్టారు.